క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌ను అభినందించిన మంత్రి



ప్రిన్సిపాల్ సీతారాంకు మెమెంటో అందజేస్తున్న మంత్రి సవిత

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలురు గురుకులంలో ప్రిన్సిపాల్ సీతారాంను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అభినందించి మెమెంటో అందజేశారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలలో శాతశాతం ఉత్తీర్ణత సాధించడంతో గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అభినందించి అన్ని రంగాలలో విద్యార్థులను తీర్చి దిద్దడంతో మరింత ప్రత్యేక చొరవ చూపాలని సూచించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

వినియోగంలోకి చెత్త నుంచి సంపద కేంద్రం



చెత్త నుంచి సంపద కేంద్రంలో చెత్త, వాహనాలను తొలగించిన ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్...

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో వినియోగంలో లేకుండా పోయిన చెత్త నుంచి సంపద కేంద్రంపై నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శుక్రవారం మండల పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు. కేంద్రంలో ఉన్న ఆటోను అక్కడ నుంచి తరలించారు. కుండీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి షెడ్‌లో ఉన్న వస్తువులు తొలగించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చినట్టు ఈవోపీఆర్డీ రవికుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరికలు పెరగాలి

• ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం

దత్తిరాజేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల చేరికలు తక్కువగా ఉన్నాయని, దీన్ని పెంచాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. వేసవిలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దత్తిరాజేరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు వివరించారు. సీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు కమీషన్ వసూలు చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

గుర్ల: డీసీసీబీలో రుణాలు తీసుకుంటున్న రైతులు, మధ్య తరగతి ప్రజల వద్ద కమీషన్ తీసుకుంటున్న అధికారులపై డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని డీసీసీబీ సిబ్బంది మండలంలోని గరిడ గ్రామానికి చెందిన మీసాల సత్యవతి రూ.5లక్షల గృహ రుణం మంజూరుకు రూ.10వేలు కమీషన్ అడగడంతో కమీషన్ ఇస్తేనే రుణం అనే శీర్షికతో సాక్షి మంగళవారం ప్రచురించింది. ఈ కథనానికి డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున స్పందించి మీసాల సత్యవతికి గృహ రుణం తక్షణమే ఇప్పించాలని డీసీసీబీ సీఈవోకు శుక్రవారం ఆదేశించారు. రుణాలు కోసం వచ్చే వారిని కమీషన్లు కోసం వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీసీబీ సిబ్బందికి హెచ్చరించారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు



కొత్తవలస మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా దోమల నివారణపై అవగాహన ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినదించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలతో కలసి ర్యాలీల్లో పాల్గొన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీని తరమికొట్టగలమన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



గంట్యాడ: పీఎం పాలేంలో డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



వేపాడ: ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది



లక్కవరపుకోట: ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

ఫాం పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



నెలివాడలో ఫాం పాండ్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

బొండపల్లి: ఫాం పాండ్ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.తులసీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో చేపడుతున్న ఫాం పాండ్ పనులును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పంట పొలాల సాగుకు కావాల్సిన సాగు నీరు ఈ పాండ్‌ల ఏర్పాటు ద్వారా సాగుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ముందుకొచ్చి తమ పొలాల్లో రెండు నుంచి ఐదు సెంట్లు విస్తీర్ణంలో తవ్వకాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో జి.అరుణకుమారి, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సుధీర్

చీపురుపల్లి: వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో చలి వేంద్రం ఎంతో అవసరమని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.సుధీర్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రతీ ఒక్కరూ తరచూ మంచినీరు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు వారి సహాయకులు ఎండలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే మానవీయత సంస్థ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి ముగిసేంత వరకు చలివేంద్రం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బివి.గోవిందరాజులు, ప్రతినిధులు డిఆర్.ప్రసాదరావు, పనస రవి, హెడ్ సిస్టర్లు సింహాచలం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన



లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో గల శారద మెటల్స్ అండ్ స్టీల్స్ ఎల్లోయిస్ కర్మాగారంలో రోడ్డు ప్రమాదాల నివారణపై లారీ డ్రైవర్లకు సీఐ షణ్ముఖరావు శుక్రవారం అవగాహన కల్పించారు. కర్మాగారానికి ముడి సరుకు విశాఖపట్నం పోర్టు నుంచి ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా లారీలపైన వస్తోంది. కాగా ఈ లారీలు అధిక లోడ్‌లతోను, అతివేగంగా నడుపుతున్నారని ఇది నేరమని సీఐ హెచ్చరించారు. లారీ డ్రైవర్లు మద్యం సేవించి నడిపినా, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తవలస జంక్షన్ మీదుగా రాకపోకలను మంగళ, శుక్ర, శనివారాల్లో సాగించవద్దని సూచించారు. గడిజాల రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. ఆ రోజుల్లో ట్రాఫిక్ ఎక్కువగా వుండడం వలన గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: పట్టణంలో ఒకటో వార్డుకు చెందిన రేగ పుణ్యగిరి గిరిజనులు సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద రహదారి కోసం శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా గిరిజనులకు నేటికి స్వాతంత్య్రం రాలేదన్నారు. అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న గిరిజనులకు తాగునీరు, రోడ్డు సదుపాయం, విద్యుత్ సదుపాయం లాంటి కనీస మౌలిక వసతులు కల్పించకపోవటం దారుణమన్నారు. వైద్యం కోసం డోలీ మోత తప్పడం లేదన్నారు. రేగ పుణ్యగిరికి రోడ్డు అసంపూర్తిగా నిలుపు చేశారన్నారు. గిరిజన సమస్యలపై స్పందించని పక్షంలో ఈ నెల 30న ఆ ప్రాంత గిరిజన ప్రజానీకంతో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వంటా వార్పుతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో చెలికాని ముత్యాలు, సిదర అర్జున్, జి.సన్యాసిరావు, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీసీఐ బృందం పర్యవేక్షణ



కళాశాలలో ల్యాబ్ సౌకర్యాలపై పర్యవేక్షణ చేస్తున్న వీసీఐ సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) బృందం సభ్యుల పర్యవేక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ పర్యవేక్షణలో భాగంగా కళాశాలలో నిర్మించిన భవన సముదాయంతో పాటు ల్యాబ్ సౌకర్యాలను, మౌలిక వసతులను పర్యవేక్షణ చేశారు. కళాశాలలో అధ్యాపక సిబ్బంది వివరాలు, విద్యార్థులకు సకాలంలో బోధన సక్రమంగా జరుగుతుందా.. లేదా.. అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీసీఐ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయో.. లేవో... పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో గుజరాత్ కామధేను యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.యమ్.లునగారియా, ఒడిశా వెటర్నరీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.అంబికాప్రసాద్ కె.మహాపాత్ర, మహారాష్ట్ర వెటర్నరీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.ప్రతిభా జండే పాల్గొన్నారు.

18న ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ వర్ధంతి

వేపాడ: ప్రజాకవి, సినీగేయ రచయిత, అనువాదకుడు, వక్త ఉద్యమనేత కలేకూరి ప్రసాద్ వర్ధంతి ఈ నెల 18న విజయనగరంలో నిర్వహించనున్నట్టు బహుజన కళా మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయ్‌భాస్కర్ శుక్రవారం తెలిపారు. బహుజన మేధావులు శివశంకర్, గురాన అయ్యలు, ఆదాడ మోహన రావు, గంటాన అప్పారావు తదితరులు పాల్గొంటారన్నారు. దళిత సాహిత్య ఉద్యమాన్ని నడిపిన కలేకూరికి ఘన నివాళులు అర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి హాజరు కావాలని పిలుపునిచ్చారు. బహుజన కళామండలి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

కోటగండ్రేడులో మలేరియా...!

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో మలేరియా కేసు నమోదు కావడంతో స్థానికులు కలవరం చెందారు. గ్రామానికి చెందిన బొనంగి రాంప్రసాద్ ఒడిశా రాష్ట్రానికి కూలీ పనులు చేసుకోవడానికి వలస వెళ్లాడు. ఆయన వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. వచ్చిన సమయంలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం గుర్ల పీహెచ్‌సీకి వెళ్లాడు. పరీక్షలు చేసిన వైద్యాధికారులు మలేరియాగా నిర్ధారించారు. చికిత్స అనంతరం ఆయన కోలుకున్నట్టు గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. గ్రామంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశామని ఎటువంటి మలేరియా వ్యాధి లక్షణాలు కనపడలేదని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే మలేరియా కోటగండ్రేడులో రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని వైద్యాధికారులు సూచించారు.

ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు



రాజాం రోడ్‌లో రైల్వేస్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై ప్లాస్టిక్ పోగులు

చీపురుపల్లి: ప్లాస్టిక్, పాలథిన్ పేరెత్తితే చాలు వామ్మో అనాల్సిన పరిస్థితులు ఎప్పుడో ఏర్పడ్డాయి. ప్లాస్టిక్ నిషేధం, పాలథిన్ నిర్మూలన అంటూ అధికారులు, ప్రభుత్వం ప్రకటనలే తప్ప క్షేత్ర స్థాయిలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఎక్కడ చూసినా గుట్టలుగా ప్లాస్టిక్, పాలథిన్ దర్శనమిస్తోంది. చీపురుపల్లి – రాజాం రోడ్‌లో రైల్వేస్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై ఇలా ప్లాస్టిక్ పోగులను చూసిన వారంతా వామ్మో అంటున్నారు. ప్రభుత్వం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రా పేరుతో ప్రతీ నెలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్లాస్టిక్ నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెలలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించి ఫొటోలు దిగడం తప్ప ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

బొండపల్లి: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా పడినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 20న తలపెట్టిన సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడినట్టు చెప్పారు. సమ్మెకు అందరూ సిద్ధం కావాలని కోరారు.

'అంగన్‌వాడీ' చుట్టూ మురుగు



బొండపల్లి మండల కేంద్రంలో మురుగుతో కాలువలు నిండిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోయి మురుగు బయటకు వస్తోంది. ముఖ్యంగా గ్రామంలో ముద్దూరు గ్రామానికి వెళ్లే రహదారికి పక్కన యాతపేటకు వెళ్లే మార్గంలో గల అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ మురుగుతో కాలువలు నిండిపోయాయి. దీని వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు శుభ్రం చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – బొండపల్లి

మెట్టకాలనీలో వీధి కుళాయి దుస్థితి



చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి మెట్ట కాలనీలో ప్రజలకు మంచినీరు అందించే వీధి కుళాయి చుట్టూ తుప్పలు, డొంకలు ఇలా మొలిచాయి. తాగునీటి సరఫరా చేసే కుళాయి ట్యాప్ కూడా తుప్పు పట్టింది. ఈ కుళాయి నుంచి మంచి నీరు సేవించడం ఎంత సురక్షితమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు ఏమాత్రం కలుషితమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ కాలనీలో సుమారు 500కు పైగా నివాసాలు ఉన్నాయి. మొత్తానికి ఇదొక్కటే కుళాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – చీపురుపల్లి

రోడ్డెక్కిన మురుగు



గజపతినగరం మండల కేంద్రంలో శుక్రవారం కురిసిన వర్షానికి పలుచోట్ల కాలువల్లోని మురుగు రోడ్డెక్కింది. పురిటిపెంట బాలాజీనగర్‌లో కాలువలు సరిగా లేకపోవడంతో వర్షపు నీరు మురుగు కలిసి రహదారిపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అయితే కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. – గజపతినగరం

భూముల వివరాల పరిశీలన



దెందేరు రామాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

కొత్తవలస: అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల వర్తింపు కోసం రైతులకు సంబంధించిన భూముల వివరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్టు ఏవో కె.మాధురీశరణ్య తెలిపారు. మండలంలోని మిందివలస, రామచంద్రాపురం, దెందేరు గ్రామాల్లో జరుగుతున్న పరిశీలన కార్యక్రమాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాలు వర్తింపుకు రైతులు తమ భూముల యొక్క 1 బీ, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్లతో సమీపంలో గల రైతు సేవా కేంద్రాల్లో పరిశీలన చేసుకొని నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని పత్రాలను జత చేసి నమోదు చేయాలని సూచించారు. కౌలు రైతులు తాము సాగు చేస్తున్న భూముల వివరాలను రెవెన్యూ కార్యదర్శులకు తెలిపి కౌలు కార్డులు పొందాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె.లక్ష్మి, కె.హేమ తదితరులు పాల్గొన్నారు.

• నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న రీజినల్ ప్రకృతి వ్యవసాయాధికారి

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారానే భూసారాన్ని కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి కె.హేమసుందర్ పేర్కొన్నారు. మండలంలోని వెదురువాడ గ్రామంలో నవధాన్యాల కిట్లును రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 రకాలైన విత్తనాలను కలిపి ఒక కిట్టుగా ఏర్పాటు చేసి ఎకరాకు 12 కేజీలు చొప్పున చల్లుకోవడం ద్వారా నవధ్యానాల వలన భూసారాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులు వాడకాన్ని పెంచేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వెదురువాడ, మరువాడ, కొత్తపాలెం, జె.గుమడాం గ్రామాల్లోని రైతులకు 500 నవధాన్యాల కిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంటీ సన్యాసినాయుడు, డీఎంఎంటీ రామకృష్ణ, ఎల్ 2 సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

పూల సోయగం



అరకు-విశాఖ రోడ్డులో గంగుబూడి జంక్షన్ వద్ద ఆహ్లాదకరంగా వున్న తురాయ్ పూలు

విశాఖ – అరకు అంతర్ రాష్ట్ర రహదారిలో తురాయ్ చెట్లు పూల సోయగం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అరకు అందాలను తిలకించేందుకు వెళ్లే పర్యాటకులకు కొత్తవలస నుంచే పూలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో పాటు అధిక వర్షాలు కురవడంతో చెట్లు పూర్తిగా చిగురించి ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తవలస మండలం అప్పన్నపాలెం, గాంధీనగర్, లక్కవరపుకోట మండలం గంగుబూడి, మల్లివీడు ప్రాంతాల్లో తురాయ్ చెట్లు దట్టంగా ఉంటూ ఆకట్టుకుంటున్నాయి. లక్కవరపుకోట మండలం సంతపేట నుంచి చందులూరు రోడ్డు, గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి కళ్లేపల్లి రోడ్డులో తురాయ్, రెల్లి పూలు అందంగా ఉంటూ ఆకర్షిస్తున్నాయి. – కొత్తవలస



సంతపేట - చందులూరు రోడ్డులో ఆకర్షణీయంగా రెల్లి పూలు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గజపతినగరం	చీపురుపల్లి	ఎస్.కోట
9010204447	9951602843	9951602965

Office mail : vzmadvt@gmail.com